క్లుప్తంగా

నేడు కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలోని యువరాజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, రాష్ట్ర హోం తానేటి వనిత, కలెక్టర్ కె.మాధవీలత, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

తాత్కాలిక రోడ్డు ప్రారంభం



తాత్కాలిక రోడ్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: రోటరీ క్లబ్ అందిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కొనియాడారు. నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో స్థానిక గాంధీనగర్‌లోని ప్రకృతి డిస్పెన్సరీ (యోగా, ప్రకృతి వైద్యం, ఆయుర్వేద హాస్పిటల్)కు వెళ్లడానికి తాత్కాలిక రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు, వార్డ్ కౌన్సిలర్ పడాల శిరీషతో పాటు శ్రీకాకుళపు పురుషోత్తం, దార్ని సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాసు, బొజ్జా పాపారావు, వైద్యురాలు కొల్లిపర శ్రీవిద్య, గొన్నా బత్తుల రామారావు, ఎం.చిట్టిబాబు, బలగం అప్పారావు, కామిశెట్టి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

70 మందికి గుండె వైద్య పరీక్షలు



సూర్యారావుపాలెంలో గుండె పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భారతి

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెం సొసైటీ వద్ద మంగళవారం ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాకతీయ యూత్ ఆధ్వర్యంలో, విజయవాడకు చెందిన ఉషా కార్డియాక్ సెంటర్ డాక్టర్ వైవీ రావు సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె వైద్య నిపుణురాలు భారతి సుమారు 70 మందికి పరీక్షలు చేశారు. వారిలో 15 మందికి గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్టు గుర్తించారు. వారిని విజయవాడ ఆసుపత్రికి తీసుకు వెళ్లి మరోసారి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ భారతి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చామర్తి తమ్మిరాజు, కార్యదర్శి శ్రీనివాసు, దిద్దుపూడి విస్సు పాల్గొన్నారు.

గుండెపోటులో పొలంలో రైతు మృతి

దేవరపల్లి: పొలంలో వరి ఆకు తీస్తుండగా గుండెపోటు రావడంతో గనుసుల వెంకటేశ్వరరావు (67) అనే రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని యర్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఉదయం పొలంలో ఆకు తీతకు వెళ్లిన కొద్దిసేపటికి ఆకుమడిలోనే వెంకటేశ్వరరావు కుప్పకూలి పోయాడు. నాట్లు వేస్తున్న కూలీలు గమనించి పక్క పొలం రైతుకు చెప్పగా వెళ్లి పరిశీలించాడు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు గమనించారు.

కట్నం వేధింపులపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ మంగళవారం తెలిపారు. మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన ఖండవల్లి రత్నకుమారికి హైదరాబాద్‌కి చెందిన యగ్నేశ్వరరావుకు 2014లో వివాహమైంది. కొంత కాలంగా తన భర్త యగ్నేశ్వరరావుతో పాటు అతని కుటుంబ సభ్యులు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు రత్నకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి లక్ష్మీ కేఫ్‌కు వచ్చే సందులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడి వంటిపై మెరూన్ కలర్ చొక్కా, లుంగీ ఉన్నాయని, వర్షం కారణంగా చేతులు బిగుసుకుని పోయాయని తెలిపారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మణిపూర్ ఘటనలు దేశానికి అప్రతిష్ట

నిడదవోలు రూరల్: మణిపూర్‌లో చోటు చేసుకున్న స్త్రీలను నగ్నంగా ఊరేగించడం, సామూహిక అత్యాచారాలు చేయడం వంటి ఘటనలతో దేశం సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు అన్నారు. మణిపూర్ ఘటనపై అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సూరాపురంలో నిరసన తెలిపారు.

మెట్టలో ముమ్మరంగా వరినాట్లు

- వర్షాలతో నిండుకుండల్లా సాగునీటి చెరువులు
- తాడిపూడి కాలువ నుంచి నీటి విడుదల
- ఇప్పటికే డివిజన్‌లో 16,787 హెక్టార్లలో నాట్లు



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో చెరువు ఆయకట్టు కింద వరి నాట్లు వేస్తున్న కూలీలు

దేవరపల్లి: విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పాటు తాడిపూడి కాలువకు నీటిని విడదల చేయడంతో మెట్ట ప్రాంతంలో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. కాలువ నీటితో చెరువులను నింపి ఆయకట్టు భూముల్లో నాట్లు వేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకూ వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ముందస్తు సాగు కోసం కొందరు రైతులు బోర్ల కింద వరినార్లు పోశారు. దాంతో బోర్ల కింద జులైలోనే దాదాపు వరినాట్లు పూర్తి చేశారు. కాలువ, చెరువుల ఆయకట్టుదారులు మాత్రం నాట్లు పడక ఆకాశం వైపు చూశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. కొవ్వూరు డివిజన్‌లోని ఆరు మండలాల సాధారణ వరి సాగు విస్తీర్ణం 24,469 హెక్టార్లు. ఇప్పటి వరకూ 16,787 హెక్టార్ల విస్తీర్ణంలో నాట్లు వేశారు. మరో పది రోజుల్లో నాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇవీ సాగు చేస్తున్న వంగడాలు

అధిక దిగుబడులతో పాటు చీడపీడలను తట్టుకునే వరి వంగడాలను మెట్ట ప్రాంత రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది ముందస్తు సాగు ద్వారా తెగుళ్ల నుంచి పంటలను రైతులు కాపాడుకున్నారు. దీంతో దిగుబడులు కూడా గణనీయంగా వచ్చాయి. ఎకరాకు 35 నుంచి 42 బస్తాల దిగుబడి సాధించారు. ఎంటీయూ 7029, సంపద స్వర్ణ, సీఎల్‌ఏ 1100, బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, వంటి వంగడాలను ఈ ఏడాది రైతులు సాగు చేస్తున్నారు.

కొవ్వూరు డివిజన్‌లో మండలాల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం, వేసిన నాట్ల వివరాలు

మండలం	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లు)	వేసిన నాట్లు (హెక్టార్లు)
చాగల్లు	3565	3250
దేవరపల్లి	3804	2050
గోపాలపురం	4123	1326
కొవ్వూరు	4747	4400
తాళ్లపూడి	3838	1960
నల్లజర్ల	4392	3801

చెరువు ఆయకట్టులో నాట్లు వేస్తున్నాం



పుష్కలంగా నీరు అందుతోంది. వారం రోజులుగా దమ్ములు చేసి నాట్లు వేశాం. నేను రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది నాట్లు దాదాపు నెల ఆలస్యం అయ్యాయి. గ్రామంలోని నల్ల నీలకట్టు చెరువు విస్తీర్ణం 60 ఎకరాలు. చెరువు పూర్తిగా నిండింది.

– కొల్లు సుబ్బారావు, కౌలు రైతు, యాదవోలు

సాగుకు నల్ల నీలకట్టు చెరువే ఆధారం



యాదవోలులో బోర్లు తక్కువ. చెరువులపైనే ఆధారపడి పంటలు వేస్తున్నాం. నల్ల నీలకట్టు చెరువు తాడిపూడి కాలువ నీటితో నింపి ఆయకట్టు భూముల్లో నాట్లు వేస్తున్నాం. ఆయకట్టు విస్తీర్ణం సుమారు మూడు వేల ఎకరాలు ఉండగా, ఇప్పటి వరకూ రెండు వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. తాడిపూడి కాలువ నీటిని జూలై మొదటి వారంలో విడుదల చేస్తే సకాలంలో నాట్లు వేయగలం.

– కాగిత కృష్ణ, రైతు, యాదవోలు

ముమ్మరంగా నాట్లు



కొవ్వూరు డివిజన్‌లోని మెట్ట ప్రాంతంలో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆరు మండలాల్లో 24,469 హెక్టార్లు వరి సాధారణ విస్తీర్ణం ఉండగా, ఇప్పటి వరకు 16,787 హెక్టార్లలలో నాట్లు వేశారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

– చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

అభివృద్ధే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారు



బీసీ కాలనీలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గోపాలపురం బీసీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం పద్మశ్రీ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిరెడ్డి నాగరాజు, కప్పల వరలక్ష్మి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే వల్లీ, సర్పంచ్ పైడి శిరీష, నాయకులు వింజమూరి సుబ్బారావు, వింత ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి సిందూర పూజ

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలో కొలువైన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి సిందూర పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర నామ తమలపాకుల పూజ జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

- కొవ్వూరు నియోజకవర్గానికి రూ.1.60 కోట్లు
- ఎంపీ మార్గాని భరత్ రామ్ వెల్లడి

కొవ్వూరు: ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి కొవ్వూరు నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మొబైల్ వాటర్ ట్యాంకులకు రూ.40 లక్షలు అందజేయనున్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. కొవ్వూరులో మంగళవారం హోం మంత్రి తానేటి వనితతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో బైపాస్ రోడ్లలో కాటన్ జంక్షన్ వద్ద ప్రభుత్వ స్థలంలో 40 సెంట్ల భూమిని బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కేటాయించడానికి సహకరించిన మంత్రి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నామన్నారు. సీఎస్‌ఆర్ నిధులను సమీకరిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సమయానికి కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నామన్నారు. కరోనా విపత్తు కారణంగా గడచిన రెండున్నరేళ్లు ఎంపీ ల్యాడ్స్ నిధులను ప్రధాన మంత్రి సహాయ నిధికి జమ చేశారన్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఎంపీ నిధులతో ఆరికిరేవుల, ఐ.పంగిడిలో, చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం,ఊనగట్ల,అన్నదేవరపేట, పోచవరంలో బీసీ కమ్యూనిటీ హాళ్లు నిర్మించనున్నట్టు ప్రకటించారు. గోదావరి మాత విగ్రహం నుంచి గామన్ ఇండియా బ్రిడ్జి వరకు అధ్వానంగా ఉన్న రహదారి పునరుద్ధరణకు ఎంపీ భరత్ చొరవ తీసుకున్నారన్నారు.



విలేకరుల సమావేశంలో ఎంపీ భరత్‌రామ్, హోం మంత్రి తానేటి వనిత తదితరులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

కొవ్వూరు: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని ఆవుల వారి వీధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలో ఎంపీ మార్గాని భరత్‌రామ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని ఎంపీ భరత్ రామ్ కోరారు. మంత్రి, ఎంపీ చేతుల మీదుగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామ కృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్

అర్హులైతే ఇంటికే సంక్షేమ పథకాలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ముక్కామల పంచాయతీలో గడప గడపకూ..

పెరవలి: అర్హులైతే తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని ముక్కామల పంచాయతీ పరిధిలోని ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెంలలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో లబ్ధి పొందని గృహస్తులే లేరన్నారు. గతంలో గోదావరి వరదల వలన నష్టపోయిన అరటి రైతులకు కూడా నష్టపరిహారాన్ని అందించామని చెప్పారు. టీడీపీ పాలన అంతా 'దోచుకో–దాచుకో' అన్నట్టుగా ఉండేదన్నారు. ఈ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థిక ఫలాలు లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా అందిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీనువాస్, సొసైటీ అధ్యక్షుడు రేలంగి ఏసు, వివిధ శాఖల అధికారులు, వివిధ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.



ముక్కామల వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

జవాబుదారీతనంతో ఓటర్ల సవరణ

- జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్
- క్షేత్రస్థాయి సవరణ ప్రక్రియ పరిశీలన

కొవ్వూరు: జవాబుదారీతనంతో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వో) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే తీరును ఆర్డీవో ఎస్.మల్లిబాబుతో కలిసి మంగళవారం సాయంత్రం జేసీ పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా, హేతుబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఒకే డోర్ నంబర్‌తో పదికి పైగా ఓటర్లు ఉంటే వాటిని సమగ్రంగా పరిశీలించి మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత ఫారాల్లో నమోదు చేసి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్థానిక యువరాజ్ ఫంక్షన్ హాలు ఎదుటి వీధిలో 88 పీఎస్ పరిధిలోను, యానాద కాలనీలోని 89 పీఎస్ పరిధిలోను, సత్యవతి నగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని ధర్మవరం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న రీసర్వే డేటా ఎంట్రీని ఆయన తనిఖీ చేశారు.



కొవ్వూరులో ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీవో మల్లిబాబు

పోలింగ్ సిబ్బందికి సహకరించండి

తాళ్లపూడి: ఓటర్ల జాబితా పరిశీలన నిమిత్తం ఇంటింటికీ వచ్చే పోలింగ్ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ టి.రాధిక విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ మంగళవారం ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో కలిసి వేగేశ్వరపురంలో ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాధిక మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. సిబ్బంది డోర్ నంబర్ సరిచూసుకుని చేరిక, పేర్లు మార్పు, కొత్త ఓటర్ల నమోదు, ఫొటో మార్పు తదితర వాటిని చేపడతారన్నారు.

సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకే సురక్ష

- జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ
- పలు గ్రామాల్లో ధ్రువీకరణ పత్రాల పంపిణీ

దేవరపల్లి: ప్రజా సమస్యలు జల్లెడ పట్టి తెలుసుకుని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని యాదవోలు సొసైటీ వద్ద సర్పంచ్ సున్నం వరప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సభలో పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సురక్షలో ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి చాలా వరకూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్టు ఆమె తెలిపారు. యాదవోలు గ్రామానికి రూ.26.40 కోట్ల విలువైన సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు జెడ్పీ నిధుల నుంచి రూ.75 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించారు. ఇందులో రూ.50 లక్షలు కల్వర్టుల నిర్మాణానికి కేటాయించామన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో ఇప్పటివరకూ నియోజకవర్గంలోని 50 గ్రామ సచివాలయాలను సందర్శించి, 38 వేల వినతులను పరిష్కరించామన్నారు. యాదవోలులో రూ. 5 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. సురక్ష కార్యక్రమానికి గ్రామంలో 3030 వినతులు రాగా, వాటిలో 2863 వినతులను పరిష్కరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 453 మంది రైతులకు 1–బి పత్రాలు, 947 కులధ్రువపత్రాలు, 929 ఆదాయ ధ్రువపత్రాలు, 458 అడంగల్ పత్రాలు, పంట 20 సాగు హక్కుపత్రాలు, 3 ఆరోగ్యశ్రీ కార్డులు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు గంటా ప్రసాద్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఉప సర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తమ్మిరెడ్డి నాగప్రసన్న, కొమారవు హారికాజ్యోతి, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



యాదవోలులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

వేళ్ల చింతలగూడెంలో..

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు కుల, ఆదాయ, రేషన్, ఇంటి పట్టాదారు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ గోళ్ళ కుమార్, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు పిన్నమనేని చినబాబు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

చీపురుగూడెంలో..

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో సర్పంచ్ గాలింకి మల్లిక అధ్యక్షతన సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై 988 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు.

రు.20 లక్షలతో అంబేడ్కర్ కల్యాణ మండపం

ఎమ్మెల్యే అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.20 లక్షల వ్యయంతో అంబేడ్కర్ పేరిట చీపురుగూడెంలో కల్యాణ మండపాన్ని నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు శుభ కార్యాలు నిర్వహించుకోవచ్చన్నారు. గ్రామంలో ఆర్ అండ్ బీ సీసీ రహదారి వేయాలని, చీపురుగూడెం–అనంతపల్లి రహదారి ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేయాలని, జలకళ పథకంలో మరింత మంది రైతులకు బోర్లు వేసుకునే అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లిడి శ్రీనివాస రెడ్డి, ఉప సర్పంచ్ రాచగర్ల శ్రీతులసి, బంక అప్పారావు, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దార్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.



అన్నవరప్పాడు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

మంచి ప్రభుత్వాలతో పేదల స్థితి మెరుగుపడుతుంది

పెరవలి: ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాలు ఉంటే ప్రతి పేదవాడి ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని అన్నవరప్పాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. అన్నవరప్పాడు సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఆంధ్రప్రదేశ్‌లో పేదల శాతం 13 నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. దీనికి కారణం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే అన్నారు. ఉదాహరణగా అన్నవరప్పాడుకు సుమారు రూ.15 కోట్ల పనులు, సంక్షేమ పథకాలు అందాయన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అన్నవరప్పాడులో 1275, పిట్టల వేమవరంలో 1344 దరఖాస్తులు వచ్చాయి.వారిలో అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, సర్పంచ్ పంతం బాలసుందరి, సొసైటీ అధ్యక్షుడు పంత నాగేశ్వరరావు, గృహసారథుల కన్వీనర్ కోటిపల్లి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పంతం చిన్న, వేండ్ర కృష్ణమూర్తి, వసంతాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

1,070 మంది లబ్ధిదారులకు ..

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను–3 గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షతన సురక్ష గ్రామసభ నిర్వహించారు. మొత్తం 1,070 మంది లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు చేతుల మీదుగా వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. గ్రామంలో నూతనంగా మంజూరైన 37 రేషన్ కార్డులను కూడా లబ్ధిదారులకు అందజేసారు. తహసీల్దార్ జి.కనకరాజు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో ఇప్పటి వరకూ సుమారు 20 వేల మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మల్లిపూడి పాప, హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



వేలివెన్నులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య

పెద్దేవంలో..

తాళ్లపూడి: పెద్దేవం సచివాలయం–1 వద్ద సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు అధ్యక్షతన సురక్ష గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో దరఖాస్తు చేసుకున్న 1898 మందిని వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశామని ఎంపీడీవో వెంకట రమణ తెలిపారు. అలాగే సచివాలయం – 2 రావూరుపాడులోనూ గ్రామసభ నిర్వహించారు. ఇక్కడ 483 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, నాయకులు మైలవరపు రాధాకృష్ణ, కొలిశెట్టి నాగేశ్వరరావు, దొరాజీ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం, సమిశ్రగూడెం గ్రామాల్లో సురక్ష గ్రామసభలు సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారిద్దరితో పాటు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జేసీఎస్, మండల కన్వీనర్ వెలగన పోలయ్యలు లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గజ్జరపు శ్రీరమేష్, యాళ్ల రామారావు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.